# ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే





ఇల్లంతకుంట, బతుకమ్మ :రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, శాంతిభద్రతల పరిస్థితులను సమీక్షించారు. పోలీస్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని ఎస్పీ ఆదేశించారు. పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేసి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని ఎస్పీ ఆదేశించారు. చోరీలు, గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని అధికారులకు సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని, విద్యాసంస్థలు, గ్రామస్థాయిలో ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తనిఖీ సందర్భంగా పోలీస్ స్టేషన్ పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

# ఘనంగా శతవసంతాల ఉత్సవం

## ఉత్సవ కార్యక్రమానికి హాజరైన నాలుగు తరాల కుటుంబ సభ్యులు



బాన్సువాడ, బతుకమ్మ : బీర్కూర్ గ్రామంలోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ లో ఎన్నువార్ సాయమ్మ భర్త కీర్తిశేషులు గంగారం వారి శతవసంతోత్సవ వేడుకలను నాలుగు తరాల కుటుంబ సభ్యుల మధ్య అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు పిల్లలతో కలిసి మంగళ వాయిద్యాల మధ్య స్వాగతం పలికి ఆయురారోగ్యాల కోసం గణపతి పూజ, లలిత సహస్రనామం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలు, మనవళ్లు కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. శాలువా పూలదండ జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. పాత ఫోటోలు వీడియోలతో స్వాతంత్రం నుండి స్మార్ట్‌ఫోన్ వరకు వారు చూసిన అన్ని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కేక్ కటింగ్ చేసి కుటుంబ సభ్యులు ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్ను వార్ సాయమ్మ పేరు మీద అన్నదానం, వృద్ధాశ్రమానికి విరాళం మొక్కలు నాటడం ఇలాంటి కార్యక్రమాలు చేశామని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నువార్ కుటుంబానికి చెందిన నాలుగు తరాల కు చెందిన అందరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాయి

## రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి

నిజామాబాద్ రూరల్, బతుకమ్మ :జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నేతల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి అన్నారు. మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ రైతు పక్షాన నిలబడిన చరిత్ర బీఆర్ఎస్, బీజేపీలకు లేదని విమర్శించారు. బీఆర్ఎస్ చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు రైతులు స్పందించకపోవడంతో కొందరు నాయకులు మిలిటెంట్ తరహా కార్యక్రమాలకు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ సింగరేణిని తగలబెట్టాలని, రైళ్లు ఆపాలని చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 28 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే 39 వేల మంది రైతులకు 3.78 లక్షల యూరియా బస్తాలు పంపిణీ చేశామని చెప్పారు. జిల్లాలోని 207 కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ జరుగుతోందని వివరించారు. యూరియా వినియోగాన్ని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చిందని తెలిపారు. మండల స్థాయిలో యాప్ ద్వారా యూరియా పంపిణీ జరుగుతుందని, ఎక్కడైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరిస్తామని హామీ



ఇచ్చారు. పట్టా పాస్‌బుక్ లేని రైతులకు మండల రెవెన్యూ అధికారుల ద్వారా యూరియా అందజేస్తామని చెప్పారు. యూరియాపై ఆంక్షలు విధించింది కేంద్ర ప్రభుత్వమేనని ఆరోపించిన ఎమ్మెల్యే, రైతులకు యాప్ వల్ల ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. రైతుల పేరుతో బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయ నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, రింగ్ రోడ్డు నిర్మాణానికి నిధులు కోరినా కేంద్రం స్పందించడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడమే బీజేపీ, బీఆర్ఎస్‌ల ఉమ్మడి లక్ష్యమని ఆరోపించారు. ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై కూడా ఎమ్మెల్యే విమర్శలు గుప్పించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై అర్వింద్ మాట్లాడాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులపై అవినీతి ఆరోపణలు చేస్తున్న అర్వింద్ వాటికి ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. గత ఎనిమిదేళ్లలో నిజామాబాద్ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఏమిటో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ నేతలను అవినీతిపరులుగా విమర్శించిన బీజేపీ, ఇప్పుడు వారినే పార్టీలో చేర్చుకోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ నాయకత్వంపై కూడా ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు బీజేపీతో టచ్‌లో ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ పనికిరాడనే భావనతో కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. భవిష్యత్తులో కవిత కొత్త పార్టీ స్థాపించి బీఆర్ఎస్ అవినీతిని ప్రశ్నించే పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. తెలంగాణకు తగిన యూరియా కోటా కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశారని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజుగా నిలబెట్టిందని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తోందని, విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. చివరగా, తెలంగాణ అభివృద్ధిని బీజేపీ అడ్డుకుంటోందని, బీజేపీ – బీఆర్ఎస్‌లు తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నాయని ఎమ్మెల్యే విమర్శించారు.

# కత్తిపోట్ల కేసు ఛేదన

## ఐదుగురు రిమాండ్



నందిపేట్, బతుకమ్మ :మండల కేంద్రంలో సంచలనం సృష్టించిన నయీమ్ హత్యాయత్నం కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఘటనకు పాల్పడిన ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కే. వినయ్ తెలిపారు. రాజ్‌నగర్‌కు చెందిన షేక్ నయీమ్(30)పై పాత కక్షల నేపథ్యంలో ఆదివారం క్యారంబోర్డ్ షాప్ వద్ద కత్తులు, ఇనుపరాడ్లతో దాడి జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో నయీమ్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు అతడిని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు వెల్మల్ క్రాస్‌రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. అరెస్టైన వారిలో షేక్ తాహెర్, షేక్ తాలిబ్, షేక్ గాలిబ్ అలియాస్ హమీద్ (నందిపేట్), సయ్యద్ అబ్దుల్ హాలీం, ఎస్‌కే ఫజల్ (కామారెడ్డి) ఉన్నారు. నిందితుల నుంచి నాలుగు ఇనుపరాడ్లు, ఒక కత్తి, రెండు మోటార్‌సైకిళ్లు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే జైలు ఖాయం

## కామారెడ్డిలో ఒకే రోజు 434 మందికి కోర్టు శిక్షలు



కామారెడ్డి, బతుకమ్మ :మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కామారెడ్డి జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ఉల్లంఘనలకు పాల్పడిన 434 మందిని వివిధ కోర్టుల ముందు హాజరుపరచగా, న్యాయస్థానాలు వారికి భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు విధించారని కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర తెలిపారు. కోర్టులు మొత్తం రూ.4.94 లక్షల జరిమానా విధించగా, 46 మందికి జైలు శిక్షలు ఖరారయ్యాయన్నారు. వీరిలో 29 మందికి ఒక రోజు, 16 మందికి రెండు రోజుల పాటు, ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించబడిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనం నడపడం కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాదని, అది అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడటమేనని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో నిర్లక్ష్య డ్రైవింగ్ ఒకటని పేర్కొన్న ఆయన, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగి అనేక కుటుంబాలు విషాదంలో మునిగిపోతున్నాయని అన్నారు. క్షణిక ఆనందం కోసం మీ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టొద్దని, మీ కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మద్యం సేవించి వాహనం నడపడం మానుకోండని ఎస్పీ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత కఠినతరం చేస్తోందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# రైతులకు యూరియా సరఫరా యాప్‌లో కాకుండా నేరుగా చేయాలి

## బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ రూరల్ ఇంచార్జ్ బాజిరెడ్డి జగన్




సిరికొండ బతుకమ్మ :యూరియా యాప్ తొలగించాలని డిమాండ్ చేస్తూ సిరికొండ మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి మహాధర్నాలో పాల్గొన్న బాజిరెడ్డి జగన్. 'యూరియా యాప్ పోవాలి.. రేవంత్ దిగిరావాలి' అంటూ నినాదాలు చేశారు. రైతులకు తక్షణమే యూరియా అందుబాటులోకి తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి జగన్ మాట్లాడుతూ – రైతులపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే యూరియా యాప్ తెచ్చి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో రైతుబంధు ఇవ్వక రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతును రాజును చేసే ఘనత కేసీఆర్ కే




దక్కిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నా రేవంత్ సర్కార్ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో రైతులకు ఎరువులు సకాలంలో పథకాలు అందించడంతోపాటు రైతు సంక్షేమం కోరిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, ఆకుల తిరుమల్, లక్ష్మీ నరసయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.